

# మారని మనుష్యులు

తనకు జ్ఞానం తెలిసినప్పటినుంచీ రంగయ్య తెలుసు గోపాలానికి. కిర్రు చెప్పుల చప్పుడు వినబడ్డా, ఎడ్ల మెళ్ళో గంటలు వినబడ్డా "రంగయ్య వచ్చినట్లున్నాడే...." అనుకుంటూ వాకిట్లోకి పరుగెత్తుకొచ్చేవాడు. ఎదురుగా రంగయ్య కనబడేవాడు. తలపాగా, బుజంమీద చిరిగిన చొక్కా, నీరుకావి ధోవతి, అదే వేషం ఎప్పుడూ. రంగయ్య పిలుస్తే గబుక్కున ముందుకు ఉరికేవాడు. అతను ఎత్తుకుంటే కొండ ఎక్కినంత సంతోషం కలిగేది. గంభీరమైన ఆ కళ్ళమీద వత్తుగా పెరిగిన కనుబొమ్మలు. దుబ్బు మీసాలు నోటిమీదకు జారి పెదిమల కదలిక కనిపించేది కాదు.

రంగయ్య ఎప్పుడు వచ్చినా వట్టి చేతులతో వచ్చేవాడు కాదు. పాలు, పెరుగు, వేరుసెనక్కాయలు.... ఏదో ఒకటి తెచ్చేవాడు. ధాన్యం తెచ్చినప్పుడు సరే సరి ఇల్లంతా కళకళలాడిపోతుంది. వాకిట్లో నిలబడ్డ రెండెడ్ల బండి మీదనుంచి వడ్ల బస్తా వీపుమీదకు వేసుకుని వస్తుంటే, భూమి ధన ధన చప్పుడయ్యేది. బస్తాలోంచి ధాన్యం జుంయిమంటూ ధాన్యపు కొట్టులోకి జారుతుంటే సెలయేరు జీవనదిలో కలుస్తున్నట్లుండేది.

రంగయ్యంటే ప్రాణం గోపాలానికి. అప్పుడప్పుడు వాళ్ళ ఇంటికి పోతుండేవాడు, పొలానికి గూడా పోతుండేవాడు. నాట్ల సమయంలో రంగయ్యను చూస్తే భలే తమాషాగా ఉండేది. పైన ఎండ, వళ్ళంతా మట్టి అంటుకుని నీళ్ళతో కలిసి ఎండకి మెరిసేది. అసలే మట్టిరంగు మనిషి.

అతన్ని పొలంలో నిలబడ్డప్పుడు చూస్తే "ఆ మట్టిలో నుంచి తయారుచేసిన బొమ్మా..." అనిపిస్తాడు.

గోపాలం పెరిగి పెద్దవాడవుతుంటే రంగయ్య ముసలివాడై పోలేదు. శరీరదారుఢ్యం ఏ మాత్రం తగ్గలేదు. కండలు మెలికలు తిరిగే ఉన్నాయి. అయితే నల్లజుట్టు మాత్రం తెల్లబడింది. అంతే!

గోపాలం హైస్కూలు చదువుదాటి కాలేజీ చదువుకు వచ్చాడు. పల్లెటూరి వాతావరణం నుంచి పట్టణంలో అడుగుపెట్టేటప్పటికి తన ప్రపంచం పెరిగి పెద్దదయింది. బిళ్ళంగోడు ఆటనుంచి క్రికెటు ఆటలోకి వచ్చాడు. చిన్ననాటి స్నేహితాలు మరుగున పడి కొత్త స్నేహితాలు ఏర్పడ్డాయి. రంగయ్య అయితే అక్కడే తను నమ్ముకున్న పొలంలోనే ఉండిపొయ్యాడు. బంగారం వంటి ధాన్యం పండించడం, పండిన ధాన్యంలో కవులు ధాన్యం గోపాలం వాళ్ళింటికి రెండెడ్ల బండిమీద చేరవెయ్యటం చేసేవాడు. మిగిలిన ధాన్యపు గింజలు ఏడాది పొడుగునా ఇంట్లో వాడకానికి సరిపోతాయి. గడ్డిగాదం గొడ్లకు సరిపోతుంది. పై రెండోపంట పెసర, మినుము వస్తుంది. ఇంట్లో పాడి. కమ్మని పెరుగు, నెయ్యి, కడుపు నిండా తినడం, కమ్మగా నిద్రపోవడం. పగలల్లా పనిచేస్తున్నప్పుడు ఒళ్ళు దాచుకోకుండా ఎలా పనిచేస్తాడో, రాత్రిళ్ళు అంత ఒళ్ళు తెలియకుండా నిద్రపోతాడు. వేరే ఆలోచనలు, ఆవేదనలు లేవు. సంసార బాధ్యతలు లేవని కాదు. మగపిల్లలు పెరిగి పెద్దవాళ్ళయితే వాళ్ళకి పొలంపనులు నేర్పాడు. ఆడపిల్లలకు మంచి సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేశాడు. కష్టాలు వస్తే నిబ్బరంగా ఉండేవాడు. ఎప్పుడూ ముఖంలో అనిర్వచనీయమైన తృప్తి, కాంతితో తళతళలాడుతూ ఉండేవాడు.

గోపాలం కాలేజీ చదువుల్లో చేరిన తర్వాత రంగయ్యను గురించి రకరకాల ఆలోచనలు వచ్చాయి. రంగయ్య జీవితం యాంత్రికంగా నడుస్తున్నట్లు కనిపించింది. తనయితే పుస్తకాల్లో ఎన్నో విషయాలు చదువుకున్నాడు. సభల్లో ఎందరివో ఉపన్యాసాలు విన్నాడు. ప్రపంచంలో వస్తున్న విప్లవాత్మకమైన పరిస్థితుల్ని ఆకళింపు చేసుకోవటానికి ప్రయత్నించాడు. ఆవేదన, ఆందోళన ఎక్కువయ్యాయి. రంగయ్యకివి ఏమీ అక్కర్లేకపోవటం విచిత్రంగా కనిపించింది గోపాలానికి. రంగయ్యది ధ్యేయంలేని జీవితం అని కూడా అనుకున్నాడు. తను తెల్సుకున్న విషయాలన్నీ రంగయ్యకు చెప్పాలనీ.... అతనిలో చైతన్యం తీసుకొని రావాలనీ... అనుకునేవాడు. ఈ ప్రస్తావన ఎప్పుడన్నా తీసుకుని వస్తే "అయన్నీ నాకెందుకు అబ్బాయిగోరు... నీ ఆసుమంటి చదువుకున్నోళ్ళకి గాని!" అనేవాడు. చికాకు అయ్యేది గోపాలానికి.

దేశం అంటే తెలీదు, దేశానికి ఎల్లలంటే తెలీదు, ప్రభుత్వం అంటే తెలీదు, దేశ రక్షణంటే తెలీదు.... చైనావాళ్ళు యుద్ధానికి వచ్చారంటే తెలీదు, ఏదో యుద్ధానికి వచ్చారని తప్ప. ఎటునుంచి వచ్చారు, ఎంత ఆక్రమించుకున్నారు? వాళ్ళ జాతి పూర్వచరిత్ర ఏమిటి? అందులో ఒక్క విషయమన్నా తెలియకపోవటం బాధగా తోచింది. ఇటువంటి మూర్ఖులు దేశం అంతా నిండిపోతే దేశం బాగుపడేదెట్లాగో గోపాలానికి అర్థం కాలేదు. పరీక్షలయి యింటికి వచ్చిన మర్నాడు పొలానికెళ్ళాడు. రంగయ్య మామిడిచెట్టు నీడలో వట్టి నేలమీద నిశ్చింతగా పడుకున్నాడు.

"రంగయ్యా..." గోపాలం మెల్లిగా పిలిచాడు. రంగయ్య ఉలిక్కిపడి లేచి "అబ్బాయిగారా....

రండి రండి .... ఎప్పుడొచ్చారు ఊరినుంచి...." అంటూ పలకరించాడు.

"నిన్నొకమాట అడుగుతాను రంగయ్యా ఏమీ అనుకోకుండా సమాధానం చెబుతావా?" గోపాలం సూటిగా అడిగాడు.

"అదేటండి .... అట్టా అంటరు. తమాషాగా మాట్టాడుతుండారే ఇయ్యాల...." అన్నాడు రంగయ్య. గోపాలం శరీరంలో వేడిరక్తం పురకలు పెట్టింది. దేశం అత్యవసర స్థితిలో వుంటే మామిడిచెట్టు నీడలో నిశ్చింతగా పడుకున్న రంగయ్య అజ్ఞానాంధకారాన్ని ఎట్లా వెడలగొట్టడం...." అనుకున్నాడు గోపాలం.

"దేశం అంతా యుద్ధం గొడవలతో ఉడికిపోతూ ఉంటే, దేశరక్షణకై నడుం కట్టి ముందుకు దూకాలని ఉండదా నీకు... ఇవన్నీ తెలియకపోతే ఎట్లా రంగయ్యా?" అన్నాడు గోపాలం ఆవేశంగా. రంగయ్య మీసాలు సర్దుకుని తాపీగా నవ్వాడు.

"అంతా ఉపన్యాసాలు విని ఊరిమీద పడితే పొలంపని చూసేవాడెవడండి? మా అయ్య అన్నట్టు రైతుకి పొలమేగాదుటండి, అన్నం పెట్టే తల్లి అయినా, దేశం అయినా, ఇంకోటి అయినా..." అన్నాడు.

ఆకాశవాణి సౌజన్యంతో (చుక్కాని - 15 జూన్, 1963 )